క్లుప్తంగా

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 7 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు, మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ వివరించారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు మొక్కుగా చెల్లించారు.

కొత్తూరుకు పెరిగిన భక్తుల రద్దీ


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. ఆదివారం స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్‌లు నిండిపోయాయి. స్వామి వారి దర్శనానికి గంటలకుపైగా సమయం పట్టింది. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకొని సౌకర్యాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. అంతేకాక స్వామి వారి దర్శనమనంతరం భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేసినట్లు చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల సమస్యలపై మంత్రి వర్గ సమావేశంలో చర్చించి పరిష్కార ప్రతిపాదలనకు ఆమోదం తెలిపాలని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర కార్యదర్శి నగరి శ్రీనివాసులు, నంద్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, సాంబశివుడు కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయ ఉద్యోగులందరికీ కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు 57ను అనుసరించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. మధ్యంతర భృతి 35శాతం చెల్లించాలని కోరారు. అలాగే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. నాయకులు మధుసూదనరావు, పుల్లయ్య, జయరాం, మునిస్వామి, రవి పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌సీ పాలసీ వర్తింపజేయాలి

నంద్యాల(న్యూటౌన్):వైఎస్సార్ క్రాంతిపథం ఉద్యోగులను రెగ్యులర్ చేసి హెచ్‌ఆర్‌సీ పాలసీ వర్తింపజేసి కారుణ్య నియామకాలు చేపట్టాలని జేఏసీ గౌరవాధ్యక్షుడు ప్రసాద్, చైర్మన్ పుల్లయ్య, దానం, కిశోర్‌రెడ్డి కోరారు. ఆదివారం బొమ్మలసత్రం సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. రవికుమార్, కృష్ణారెడ్డి, ఎల్లయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గోరుకల్లుకు భద్రత కల్పించాలి

నంద్యాల(న్యూటౌన్): కరువును శాశ్వతంగా దూరం చేసే గోరుకల్లు రిజర్వాయర్‌కు భద్రత కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సోమన్న కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాయలసీమకు తలమానికంగా ఉన్న ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 12 టీఎంసీలుగా ఏర్పాటు చేశారన్నారు. కరకట్టపై ముళ్ల పొదలు నిండిపోవడంతో పూర్తిగా కుంగిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదం చోటు చేసుకోకముందే అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

నంద్యాల(అర్బన్): నున్నిపెంట లింగాల గట్టు మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గం లింగాలగట్టు వద్దనున్న దిగువ శ్రీశైలం ప్రాజెక్టులో విషవాయువు కలిసి టన్నుల కొద్ది చేపలు మృత్యువాత పడ్డాయన్నారు. చేపల వేటతో ఉపాధి పొందుతున్న వంద వాల్మీకి (మత్స్యకారులు) కుటుంబాలు తీవ్రంగా నష్టపోయారన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పోలీస్ స్పందన తాత్కాలికంగా రద్దు

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన పోలీస్ స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదు దారులు ఆయా స్టేషన్ పరిధిలోని సీఐ, డీఎస్పీ కార్యాలయాల్లో వినతులు ఇవ్వాలన్నారు.

ఇనుమును కరిగించి.. స్వేదం చిందించి

- మధ్యప్రదేశ్ నుంచి నంద్యాల జిల్లాకు వలస
- వ్యవసాయ పనిముట్లు తయారు చేసి విక్రయిస్తూ జీవనం
- ఏడాదిలో ఆరు నెలలు ఇక్కడే
- కుటుంబంతో కలిసి వస్తున్న వైనం
- ఆరుబయటే నివాసం

అది తెల్లవారుజామున ఐదు గంటలు.. చలితో ముడుచుకొని, దుప్పటి నిండా కప్పుకొని నిద్రిస్తున్నారు నంద్యాల పట్టణవాసులు. కానీ వారి జీవన ప్రయాణం మాత్రం ఆ సమయానికే మొదలైంది. ఒకరు కొలిమిలిలో నిప్పు రాజేస్తుండగా.. మరొకరు కరిగిన ఇనుముపై సమ్మెట వేస్తూ పనిముట్ల రూపకల్పనలో బిజీగా ఉన్నారు. తెల్లవారేటప్పటికి పరికరాలను మూటగట్టుకొని వీధుల్లోకి బయలుదేరడానికి ఇంకొందరు సిద్ధమవుతున్నారు. ఇలా ఏ ఒక్క రోజుకే పరిమితం కాదు వీరి దినచర్య. రబీ పంటల కోత సమయంలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కొన్ని కుటుంబాలు నంద్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వలస వచ్చి ఆరు నెలల పాటు చేతివృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తారు.


రోడ్డు పక్కన పనిముట్లు తయారు చేస్తున్న దృశ్యం



రహదారి పక్కనే జీవనం

గోస్పాడు: వారికి తెలిసిందల్లా.. ఇనుమును కరిగించి పనిముట్లు చేయడమే. అదే వారి కడుపు నింపుతోంది. తమ ప్రాంతంలో ఉపాధి లేకపోవడం, పనిముట్లకు ఆదరణ తగ్గడంతో జీవనం సాగక, కుటుంబ పోషణ కోసం, పొట్ట చేతపట్టుకొని వందలాది కిలోమీటర్ల దూరం నుంచి నంద్యాల జిల్లాలోని పలు ప్రాంతాలకు వలస వచ్చారు. మధ్యప్రదేశ్ నుంచి వచ్చి చేతివృత్తిపై ఆధారపడి పనులు చేస్తూ కాలం గడుపుతున్నారు. ఏటా అక్కడి నుంచి దాదాపు 4వేల మందికి పైగా నిరుపేదలు ఈ సమయంలో వలస వస్తున్నారు. నంద్యాల పట్టణంలోని నూనెపల్లె ప్రాంతానికి 20 రోజుల క్రితం వచ్చి రోడ్డు పక్కనే కొలిమి పెట్టుకొని రైతులకు, ప్రజలకు అవసరమైన పనిముట్లు తయారు చేసి గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి విక్రయిస్తారు. ఇలా ఆరు నెలలపాటు తమ జీవనం ఇక్కడ సాగిస్తారు.

యాంత్రీకరణ పెరిగినా..

సాంకేతిక పెరిగిన రోజుల్లోనూ ఇలాంటి వృత్తిపై ఆధారపడి బతుకుబండి లాగిస్తున్నారు. పిల్లలను పక్కనబెట్టి ఆడ, మగ తేడా లేకుండా తెల్లారేజాము నుంచి చీకటి పడే వరకు కొలిమిలో ఇనుములు కరిగించి సమ్మెట వేస్తూ పనిముట్లు తయాలు చేస్తారు. వారు తమ ప్రాంతం నుంచి పనిముట్లు తయారు చేసే పరికరాలు మాత్రమే వెంట తీసుకొస్తారు. ఈ ప్రాంతంలో పనికిరాని ఇనుప పట్టాలను కిలోల ప్రకారం కొనుగోలు చేసి వాటిని కొలిమిలో కరిగించి కొడవళ్లు, గొడ్డళ్లు, పారా, గుణపాలు, వంటకు సంబంధించిన కత్తిపీటలు, మాంసం కత్తులు వంటి వాటిని తయారు చేసి వీధుల్లో తిరిగి విక్రయిస్తున్నారు. వీరు రహదారి పక్కనే తేలిక పాటి గుడారాలు వేసుకొని అక్కడే వంటలు చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కొడవలి రూ.100 నుంచి రూ.150, గొడ్డళ్లు రూ.200 నుంచి రూ.350, మాంసం కత్తి రూ.150 నుంచి రూ.250 వరకు ఇలా పనిముట్లను బట్టి ధర నిర్ణయిస్తారు. అయితే రోజంతా పని చేసినా ఒక్కొక్కరికీ రూ.400 నుంచి రూ.500 కూడా రావడం లేదని వారు పేర్కొంటున్నారు. ఆరునెలల తరువాత తమ ప్రాంతానికి వెళ్లిపోతామని చెప్పారు.


పరికరాలను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

రోజంతా కష్టపడినా పూట గడవటం కష్టంగా ఉంది



వ్యవసాయ పనిముట్లను చిన్నప్పటి నుంచి తయారు చేస్తున్నా. మా ప్రాంతంలో పనిముట్లకు సరైన గిరాకీ ఉండటం లేదు. బతుకు తెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాం. రోజంతా శ్రమించినా కష్టానికి తగ్గ ఫలితం అందడం లేదు. పిల్లపాపలతో కుటుంబం అంతా కలిసి ఇలా ఊరూరా తిరుగుతాం. రోజంతా కష్టపడినా పూట గడవటం లేదు.

– ముఖేష్, మధ్యప్రదేశ్

పనిముట్ల తయారే జీవనాధారం



వందల కిలోమీటర్లు వలస వచ్చి వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తున్నాం. పూర్వీకుల నుంచి చేతివృత్తి పైనే ఆధారపడి కాలం వెళ్లదీస్తున్నాం. వ్యవసాయ సీజన్‌లో ఇక్కడికి వచ్చి కొలిమి ద్వారా ఇనుమును కరిగించి వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తున్నాం. కష్టపడి చేసిన పనిముట్టను విక్రయించుకునేందుకు మరింత శ్రమ పడాల్సి వస్తుంది. అందరూ కష్టపడినా రోజుకు సరిపడ కూలి అందడం లేదు.

–లక్ష్మీబాయి,, మధ్యప్రదేశ్

జనం ఆశీస్సులు జగనన్నకే


వరుడితో ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే జనం ఆశీస్సులు ఉన్నాయని, రానున్న సాధారణ ఎన్నికల్లో ఆయనే మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని రాష్ట్ర జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఎం .అంజాద్‌బాషా, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. వారు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం చాగలమర్రికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్‌పర్సన్ షేక్ గౌసియా బేగం, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ షేక్ బాబులాల్ దంపతుల కుమారై వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి సరికొత్త అధ్యాయం లిఖించారని కొనియాడారు. జగనన్న పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, అర్హులందరికీ పథకాలు అందజేస్తుండటం, అభివృద్ధితో రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. మాజీ ఎంపీ గంగుల ప్రతాప్‌రెడ్డి, ఈ.తిరుపాలరెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌసులాజం, రాష్ట్ర మైనారిటీ శాఖ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, వైఎస్సార్ కడప జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మదీన దస్తగిరా, రాష్ట్ర మహిళా ఆర్థిక సంస్థ డైరెక్టర్ శ్రీబాలవిద్య, ఎంపీపీ వీరభద్రుడు, పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గంధం రాఘవరెడ్డి, ఎంపీడీఓ మహబూబ్ దౌలా పాల్గొన్నారు.

మహానందిలో ఫిబ్రవరి 1న టెండర్లు

మహానంది: మహానందిలో ఫిబ్రవరి ఒకటవ తేదీన వివిధ అంశాలకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నవగ్రహాల వద్ద దీపారాధన సామగ్రి విక్రయం, కొబ్బరి చిప్పల సేకరణ, వాహన పూజలు జరిపించుకునే లైసెన్సు హక్కులతో పాటు మరికొన్ని అంశాలకు వేలాలు ఉంటాయన్నారు. సీల్డు, ఈ– ప్రొక్యూర్‌మెంట్, బహిరంగ వేలాల విధానాల్లో టెండర్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఓంకారంలోనూ టెండర్లు

బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓంకారం ఆలయంలో ఫిబ్రవరి ఒకటవ తేదీన టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులు పాదరక్షలు భద్రపరచుకునేందుకు, టెంకాయల విక్రయానికి, ఐస్ క్రీమ్ బండ్లు పెట్టుకునేందుకు, కూల్ డ్రింక్స్ అమ్మకానికి టెండర్లు ఉంటాయన్నారు. టెండర్లలో పాల్గొనాల్సిన వారు రూ.10,000 డిపాజిట్లు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

బాధిత రైతులకు అండగా ఉంటాం

- పంటలకు నిప్పు పెట్టిన వారికి శిక్ష పడాల్సిందే
- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి


కాలి బూడిదైన కంది పంటను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఉయ్యాలవాడ : మండలంలోని కొండుపల్లె గ్రామంలో కాలిబూడిదైన పంటలను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆదివారం పరిశీలించి బాధిత రైతులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ నెల25న రాత్రి కొండుపల్లె గ్రామానికి చెందిన అంబటి శేఖర్‌రెడ్డి సాగు చేసిన 5 ఎకరాల జొన్న పంట, పాణ్యం బాలయ్యకు చెందిన 4 ఎకరాల పొగాకు దిగుబడులు, కమ్మరి రవికుమార్ ఆచారి, విశ్వనాథరెడ్డికి చెందిన 5.10 ఎకరాల్లో కంది పంటను నూరిడి చేసేందుకు పొలంలో కోత కోసి ఉంచిన పైరుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించిన విషయం తెలిసిందే. బాధిత రైతుల దిగుబడులంతా కాలిబూడిదైన ఘటనను తెలుసుకున్న ఎమ్మెల్యే గ్రామ నాయకులు అంబటి తులసిరెడ్డితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాధిత రైతులను ఓదార్చి అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. ఈ చర్యకు పాల్పడిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధిత రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సీఎం సహాయనిధి ద్వారా పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. దశాబ్ద కాలంగా నియోజకవర్గం కక్షలు, కార్పణ్యాలు, ఫ్యాక్షన్‌కు దూరంగా ఉంటూ ప్రజలందరూ శాంతియుత జీవనం కొనసాగిస్తున్నారన్నారు. తమ పిల్లలను మంచి చదువు చదివించుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. పంట దిగుబడులు నష్టపోయిన రైతులకు సంబంధించిన వివరాలను వెంటనే అందజేయాలని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు పల్లె మహేశ్వరరెడ్డి, బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, జేఏసీ సచివాలయ కన్వీనర్ లాలమ్మగారి హుసేనయ్య, నాయకులు కందుల వెంకటసుబ్బారెడ్డి, ఎర్రి శ్రీనివాసరెడ్డి, కసాని ప్రతాప్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

చేతినిండా పనులు

- చేతికొచ్చిన రబీ పంటలు
- రోజుకు రూ.300 కూలి
- పత్తి, మిరప, శనగ, జొన్న కోతలతో రైతులు, కూలీలు బిజీ


దొర్నిపాడులో పత్తి విడుస్తున్న కూలీలు

దొర్నిపాడు: తీవ్ర వర్షభావం..పంటలు చేతికి రాకుండా పోతాయి..ఇక రైతులు నట్టేట మునిగాల్సిందే.. కూలీలకు పనులు లేక కడుపు మాడ్చుకునే పరిస్థితులు వస్తాయని అందరూ భావించారు. అదనుగా వర్షాలు లేక జలాశయాల్లో నీరు అడుగంటడంతో రబీలో భాగంగా సాగు చేసిన పంటలు ఎండు దశకు చేరుకుంటున్నాయని రైతన్నలు ఆందోళన చెందుతున్న వేళ.. ప్రభుత్వం స్పందించి వారబందీ పద్ధతిలో కేసీ, కుందూ నదులకు సాగునీటి విడుదల చేసింది. పంటలకు అనువైన సమయంలో నీటి తడులు అందించడంతో ప్రస్తుతం పంట కాలం ముగియడంతో వివిధ రకాల పైర్లను నూర్పిళ్లు చేస్తున్నారు. కాగా.. వాతావరణం అనుకూలించడంతో అన్ని పంటలు మునుపెన్నడు లేనంత దిగుబడులు లభిస్తుండటంతో అన్నదాతలు సంబరపడుతున్నారు. ఇక కోత పనులు జోరందుకోవడంతో కూలీలకు సైతం చేతినిండా పనులున్నాయి. ప్రస్తుతం కూలీకి రోజుకు రూ.300 నుంచి రూ.400 వరకు అందజేస్తున్నారు. మిరప, పత్తి, జొన్న, శనగ, మినుము కోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎక్కడ చూసినా పొలాల్లో పంట కోతపనులు జరుగుతున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి.


డబ్ల్యూ గోవిందిన్నెలో మిరప పండును కోస్తున్న మహిళా కూలీలు


బుర్రారెడ్డిపల్లెలో జొన్న కంకులను కోస్తున్న దృశ్యం

అభివృద్ధికే అధిక ప్రాధాన్యం


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే గంగుల

శిరివెళ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధికే ప్రాధాన్యతనిస్తోందని జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రూ.95 లక్షల గడప గడప, ఉపాధి పథకం నిధులతో నిర్మించిన 17 సిమెంట్ రోడ్లు, రూ.7.3 కోట్లతో వేసిన శిరివెళ్ల– చందలూరు రోడ్డును ప్రారంభించారు. ముందుగా వారికి స్థానికుల నుంచి ఘన స్వాగతం లభించింది. స్థానిక కటిక సెంటర్‌లో పార్టీ కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ శిరివెళ్ల సమగ్రాభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రూ. ప్రభుత్వం రూ.12 కోట్ల మంజూరు చేసిందన్నారు. మొదటి విడతలో రూ.6 కోట్లతో డ్రైనేజీ కాల్వల నిర్మాణం ప్రారంభించగా కరోనాతో ఆగిపోయాయన్నారు.వాటిని మళ్లీ పునఃప్రారంభిస్తామన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ బేగం, ఎంపీపీ నాయక్ వసీం, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘువరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, దేవస్థానం చైర్మన్ తిమ్మరాయుడు, కాపు సంఘం నాయకుడు ముడిమేల నాగరాజు, సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ హఫీజ్, రాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్, నాయకులు చంద్ర, అన్వర్ బాషా, దొర్నిపాటి రఫీ, వంకదార సుబ్బ సత్యనారాయణశ్రేష్టి, గండికోట పార్థుడు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, సర్పంచులు శివారెడ్డి, జింకల నాగన్న, పెద్ది రమణయ్య, చిన్న నరసింహారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..

శిరివెళ్లకు చెందిన 60 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ సీనియర్ నాయకుడు ముల్లా ఇస్మాయిల్, గౌస్, సిద్దిక్, సద్దాం, ఖుద్దుష్, వలీ, ఉస్మాన్‌బాషా, రఫీ, ఇద్రుష్, షబ్బీర్, ముల్లా సల్లాం, షాకీర్, షమీ వుల్లా, ఆనీఫ్, అబ్దుల్లా, అలాగే ఎస్సీ కాలనీకి చెందిన నక్కల బుజ్జి, గాలి జయపాల్, శేఖర్, రాజేంద్రప్రసాద్, పుట్టుపల్లి బాలస్వామి కుటుంబాలు పార్టీలో చేరాయి.

మహానందిలో సండే సందడి

మహానంది: మహానందిలో సెలవురోజు కావడంతో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. శ్రీ కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం అష్టవిధ మహా మంగళ హారతుల సమయంలో, ఆర్జిత సేవా టికెట్ల ద్వారా శివస్వాములు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి వరకు మహానందీశ్వర దర్శనం నిర్విరామంగా కొనసాగుతుందని ఈఓ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. బండిఆత్మకూరు మండలంలోని ఓంకార క్షేత్రంలోనూ ఆదివారం భక్తులసందడి కనిపించింది. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వారికి విశేష పూజలు చేపట్టారు.

సన్మానం

నంద్యాల(అర్బన్): చిన్న వ్యాపారుల సంక్షేమానికి కృషి చేస్తున్న సంఘం గౌరవాధ్యక్షుడు ఆకుమల్ల రహీంను సంఘ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ పట్టణ చిన్నవ్యాపారుల సంక్షేమానికి ఆకుమల్ల రహీం చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. అల్‌మదద్ ఫౌండేషన్ చైర్మన్‌గా, చిన్న వ్యాపారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడిగా చిరువ్యాపారులకు చేస్తున్న సేవలను అభినందిస్తూ రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ప్రశంసా పత్రం అందజేశారని చెప్పారు. ప్రధాన కార్యదర్శి మదార్‌వలి, పట్టణ కార్యదర్శి సిద్దయ్య, ఆటోనగర్ వాసు, సంజీవరాజు, తిరుమలేష్, నబిరసూల్, ఆచారి రాముడు పాల్గొన్నారు.

ఇది మా బడేనా!

- నాడు తాము చదివిన పాఠశాలను చూసి అబ్బురపడిన పూర్వ విద్యార్థులు
- నాడు–నేడుతో మారిన విద్యానిలయం రూపురేఖలు
- వైపీపీఎం ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- ప్రభుత్వ చర్యలపై హర్షం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి


సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులు

ఆళ్లగడ్డ: తాము చదువుకునే రోజుల్లో సరైన బ్లాక్ బోర్డులు కూడా ఉండేవి కాదు.. ఇప్పుడు అత్యాధునికమైన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ఉన్నాయి. మాకు టాయిలెట్స్ లేవు. ఇప్పుడు వీరికి అన్ని సదుపాయాలు ఏర్పాటయ్యాయి. మేమున్నప్పుడు తరగతి గదిలో చపట బండలు . ఇప్పుడు గ్రానైట్ పలకలతో ఫ్లోరింగ్. ఆర్‌ఓప్లాంట్, ఇంగ్లిష్, సైన్స్ ల్యాబ్‌లు.. విద్యుదీకరణ, ఆధునిక ఫర్నీచర్, గ్రీన్ చాక్ బోర్డ్స్, భవనాలకు రంగులు, ఆకట్టుకునేలా చిత్రాలు వేయడంతో కొత్త రూపును సంతరించుకుంది. అసలు ఇది తాము చదువుకున్న స్కూలేనా అని ఆశ్చర్యపోయారు. నాడు – నేడుతో పాఠశాల రూపు రేఖలు మార్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని పూర్వ విద్యార్థులు అభినందించారు. పట్టణంలో వైపీపీఎం ప్రభుత్వ ఉన్న పాఠశాలలో 1953 – 2023 వరకు చదువుకున్న పూర్వ ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలను పరిశీలించి అబ్బురపడ్డారు. ప్రభుత్వం చేస్తున్న కృషిని మనసారా మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ పాఠశాల ఆవరణలో కలియతిరిగారి ఆశ్చర్యచకితులయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ఉన్నత విద్యతోనే ఆ కుటుంబంలో ఆర్థిక, సామాజిక అసమానతలు తొలిగిపోతాయన్నదే సీఎం జగనన్న ఆశయమన్నారు.

విద్యకు పెద్దపీట



నేను ఇదే స్కూల్‌లో 1967 – 72 వరకు చదువుకున్నా. అప్పుడు చిన్న బోదగడ్డి కొట్టాలు ఉండేవి. అప్పటి పరిస్థితులు వేరు. ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులను ఈ ప్రభుత్వం సమకూర్చింది. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పఠశాలలను తీర్చిదిద్దడం అభినందనీయం.

– గంగుల ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారు (పూర్వ విద్యార్థి)

ప్రభుత్వానికి అభినందనలు



నేను 1985 – 91 వరకు ఇక్కడ చదువుకున్నా. అప్పుడు మరుగుదొడ్లు లేక ఆడపిల్లలం ఎన్నో ఇబ్బందులు పడ్డాం. నీరు దప్పికైనా తాగేవాళ్లం కాదు. ఇప్పుడు అన్ని రకాల వసతులు అద్భుతంగా సమకూర్చారు. నేను చదివిన బడి ఇంత బాగా మార్చారా అని ఆశ్చర్యపోయా. విద్యార్థినులు పడకుండా ప్రభుత్వం తీసుకున్న చర్యలను అభినందించకుండా ఉండలేం.

– కోటమ్మ,స్టాఫ్ నర్స్ (పూర్వ విద్యార్థి)

విద్యారంగ అభివృద్ధే అసలైన ప్రగతి



నేను 1966 – 72 వరకు ఇక్కడే చదువున్నా. అప్పుడు ఎక్కడో ఓ మూలన బోదగడ్డితో వేసిన కొట్టాల్లో తరగతి గదుల్లో నేలపై కూర్చుని చదువుకున్నాం. రెండు మూడు సార్లు అగ్ని ప్రమాదంలో అవి కాలి పోయాయి కూడా. ఇప్పుడు ఈ తరగతి గదులు, వసతులను చూస్తే ముచ్చటేస్తోంది. ఇలా విద్యరంగం అభివృద్ధి చెందితే భవిష్యత్‌లో మానవ వనరులు ఎంతగానో అభివృద్ధి చెందుతాయి

– శివప్రసాద్, రిటైర్డ్ జడ్జి (పూర్వ విద్యార్థి)

మళ్లీ పాఠాలు చెప్పాలనిపిస్తోంది



నేను 1972 నుంచి ఇదే స్కూల్‌లో టీచర్, లెక్చరర్, ప్రిన్సిపాల్‌గా పనిచేశా. నా 36 సంవత్సరాల సర్వీసులో 28 ఏళ్లు ఇక్కడే విధులు నిర్వహించా. అప్పుడు గుంతలు పడిన బ్లాక్ బోర్డుపై రాస్తే అక్షరాలు సరిగా కనిపించేవి కాదు. ఎన్నోసార్లు దొండాకు, బొగ్గు కలిపి దంచి బోర్డుకు పట్టించి రాయల్సి వచ్చేది. ఇప్పుడు ఈ బోర్డులు, సౌకర్యాలు చూస్తుంటే 80 ఏళ్ల వయస్సులో కూడా మళ్లీ చదువు చెప్పాలనిపిస్తోంది. అవకాశం ఇస్తే డిజిటల్ విధానంలో విద్యాబోధన చేయాలని ఆశగా ఉంది. విద్యాభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి వంద మార్కులు వేయవచ్చు.

– శంకర్‌రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్